

# హైదరాబాద్ వార్త

## బ్లాక్ మార్కెట్‌కు భారీగా పసిడి

ఇలా చెయ్యాల్సిందే.. బంగారం షాపులు, నగర తయారీ కార్ఖానాలు, ఇతర వ్యాపార కేంద్రాలపై ఆదాయపన్నుశాఖాధికారులు తరచూ నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలి. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తయారీ కేంద్రాల వద్దకు వెళ్లి వారి వద్దఉన్న కిలోల కొద్దీ బంగారాన్ని ఎక్కడినుంచి తీసుకొచ్చారు, పత్రాలు ఉన్నాయోలేవో పరిశీలించాలి. షాపుల్లో నిల్వఉన్న ఆభరణాలకు సంబంధించిన బిల్లులు ఉన్నాయో లేవోకూడా పరిశీలించాలి. ఇలాంటి చర్యలు తీసుకుంటే అక్రమంగా తరలుతున్న బంగారం.. కోట్ల కొద్ది రూపాయలు ప్రభుత్వ ఖజానాలో జమయ్యే అవకాశాలు ఉన్నాయి.



**బిల్లులు లేకుండా కిలోల కొద్ది తరలింపు**
**దక్షిణాది సంస్థల కోసం ఇక్కడే ఆభరణాల తయారీ**
**షాపులు, నగల తయారీ కేంద్రాలపై నిఘా కరువు**
**శంషాబాద్‌లో నిత్యం కిలోల కొద్దీ పట్టివేత**
**దృష్టి సారించని కమర్షియల్ టాక్స్ అధికారులు**

హైదరాబాద్, సెప్టెంబరు 6, ప్రభాతవార్త: దేశంలో బంగారం వ్యాపారం రోజురోజుకూ ఎంత అభివృద్ధి చెందుతుందో బ్లాక్ మార్కెట్‌కు కూడా విపరీతంగా తరలుతోంది. దేశవ్యాప్తంగా ఉన్నటన్నుల కొద్దీ బంగారం బ్లాక్ మార్కెట్‌కు తరలుతుందనడానికి సాక్ష్యం పట్టుబడుతున్న అక్రమ గోల్డ్ దందాదారులు, జ్యువెల్లరీ షాపుల్లో, ట్రాన్స్‌పోర్టుల్లో, పోలీసులు తనిఖీల్లో, కస్టమ్ అధికారులకు చిక్కుతున్న ఘటనలే. జీఎస్టీ అమలు తర్వాత బంగారంపై పెరిగిన ట్యాక్స్‌ల వల్ల అధికశాతం వ్యాపారులు దొడ్డి దారిన జరిగే వ్యాపారానికే మొగ్గు చూపుతున్నారు. ఎప్పటికప్పుడు నిఘా పెట్టి అక్రమంగా సాగుతున్న ఈదందాకు అడ్డుకట్ట వేయాల్సిన ఆదాయ, వాణిజ్యపన్నుల శాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. పోలీసులు, కష్టమ్స్ అధికారులు బంగారాన్ని పట్టుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారే తప్ప.. ఆదాయపన్నులశాఖ అధికారులు పట్టుకున్న దాఖలాలైతే కనిపించడం లేదు. ఆయాశాఖల అధికారులు కార్యాచరణలోకి దిగితే ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న కోట్ల రూపాయలు ఖజానాలోకి చేరు అవకాశాలు ఉంటాయి. బంగారు ఆభరణాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది పసిడిని స్థిరాస్థిగా కూడా భావిస్తారు. పెద్దపెద్ద వ్యాపారులు బంగారం నిల్వలు ఉంచి వ్యాపారం చేస్తుంటారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పుటినుంచి పను ్నల సమీకరణాలు మారాయి. అప్పటివరకు 1.2శాతం ఉన్నప్పటికీ.. గూడ్స్‌అండ్ సర్వీసెస్ టాక్స్‌ప్రవేశపెట్టడం వల్ల దాని విలువ 3శాతానికి పెరిగింది. ముంబైలోని జవేరీ బజారైనా.. హైదరాబాద్‌లోని అబిడ్స్, గుల్జార్‌హౌజ్, సికింద్రాబాద్ లాంటి ఆభరణాల మార్కెట్‌లైనా.. ఇప్పటివరకు చాలామంది వ్యాపారులు పన్నులు లేకుండా విక్రయించడానికి ఇష్టపడుతున్నారు. నిత్యం ఇలాంటి వ్యాపారం జోరుగా సాగుతున్నా.. ఏదైనా ఉదతం జరిగినప్పుడే ఈదందాలపై అధికారుల లెక్కల్లోనికి వస్తున్నాయి. ఆతర్వాత కొన్ని రోజుల హడావిడి చేయడం ఆతర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. తెరపైకి రాకుండా చాపకింది నీరులా సాగిపోతున్న ఈజీరోనెంబర్ బంగారం వ్యాపారానికి నగరంలో కొదవలేదని ఐటీ అనుమానిస్తోంది. రాజధానిలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో దాదాపు40శాతం రికార్డులకు దూరంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రతి నెలా దాదాపు రూ.100కోట్ల వరకు ఈతరహా వ్యాపారం సాగుతోందని సమాచారం.. అయినా లక్షల రూపాయల్లోనే జరుగుతుందంటూ చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. బంగారం వ్యాపావరంలో ఒక్కబిల్లు కట్‌చేస్తే ట్యాక్స్‌ల రూపంలో భారీ మొత్తమే చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అటు రిటైల్ ఇటు హోల్‌సెల్ వ్యాపారాలు కాగితాల్లోనే సాగిపోతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




## ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత

**సాగర్‌లో నిమజ్జనంపై వీడని ఉత్కంఠ**



తెలుగు తల్లి విగ్రహం వద్ద భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి బైక్ ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో మాదిరిగా గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి బైక్ ర్యాలీకి యత్నించింది. హుస్సేన్‌సాగర్ వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. హుస్సేన్‌సాగర్‌లో గతంలో మాదిరిగా గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ బ్యాక్ ర్యాలీని నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహం నుండి బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించగా, ర్యాలీకి అనుమతి లేదని భగవంత్‌రావు, రామరాజు, శశిధర్, మురారిలతో పాటు పలువురు నాయకులను సైఫాబాద్ పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అరెస్టు అయినవారిని రాంగోపాల్‌పేట్, నారాయణగూడ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అయితే పోలీసు స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత గణేష్ ఉత్సవ సమితి కార్యాలయంలో భగవంతరావు నిరసన దీక్షకు దిగారు. అనంత చతుర్ధశి రోజైన ఈనెల 9వ తేదీన హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనం జరుగుతుందని ఉత్సవ కమిటీ వెల్లడించింది. ఏ కోర్టు ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేయొద్దని చెప్పిందో ఉత్తర్వులు చూపాలని డిమాండ్ చేశారు. వెంటనే ట్యాంక్‌బండ్‌పై వినాయకుల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని బైక్ ర్యాలీని సారథ్యం వహించిననేతలు డిమాండ్ చేశారు.

**విగ్రహాలతో రోడ్లపై దిగ్బంధిస్తాం: భగవంతరావు**

నిమజ్జనం ఇంకా రెండు రోజులే ఉన్నప్పటికీ ట్యాంక్‌బండ్‌పై ఇప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంత్‌రావు అన్నారు. అనంత చతుర్దశి రోజైన ఈ నెల 9న శుక్రవారం హుస్సేన్‌సాగర్‌లో గణేష్ నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు చేయకుంటే శుక్రవారం రోడ్లపై విగ్రహాలతో ఎక్కడికక్కడ దిగ్భంధం చేస్తామని హెచ్చరిక జారీ చేశారు. భక్తులను నగరంలో ఎక్కడిక్కడా ఏర్పాటు చేసిన పాండ్స్ దగ్గరకు వెళ్లనివ్వకుండా గణేష్ విగ్రహాలను చెత్తలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనానికి ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్, మొహారం పండుగలత మీద ఉన్న ఆసక్తి గణేష్ ఉత్సవాలపై లేదని మండిపడ్డారు.

**విపరీతమైన ఎండ..**

## అంతలోనే భారీ వర్షం

హైదరాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : గత కొన్ని రోజులుగా వేడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం విపరీతమైన ఎండ ఉండగా.. అంతలోనే పూర్తి భిన్నంగా వాతావరణం చల్లబడింది. నగర వ్యాప్తంగా నల్లని మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు వణికిపోతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం కురిసిన కుండపోతతో పలుచోట్ల వరద నీరు పోటెత్తింది. రహదారులపై మోకాళ్లలోతు నీరు నిలిచిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అపార్టుమెంట్‌ల సెల్లార్లలోకి నీరు చేరింది. వర్షపు నీటి ప్రవాహంలో ద్విచక్రవాహనాలు మునిగాయి. దీంతో వాహనదారులు ట్రాఫిక్ జామ్ అయి ఇబ్బం దులు పడ్డారు. రోడ్లన్ని వరద కాలువలుగా మారాయి. సమస్యకు పరిష్కారం లేకపోవడంతో నగర జీవికి రెయినీ, ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. వర్షం కురిసిన ప్రతిసారీ వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కాగా ఎల్బీనగర్, సైదాబాద్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, రాంనగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, ఆర్టీసి క్రాస్‌రోడ్, నారాయణగూడ, అంబర్‌పేట, నల్లకుంట, హిమాయత్‌నగర్, లిబర్టీ, ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, నాంపల్లి, బషీర్‌బాగ్, ఖైరతాబాద్, మంగళ్‌హాట్, అఫ్జల్‌గంజ్, కర్మన్‌ఘాట్, మీర్‌పేట్, రాజేంద్రనగర్, అత్తాపూర్, గండిపేట్, నాచారం, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి,నానక్‌రాంగూడ, కోఠి, నాంపల్లి, దాసుసలాం, పాతబస్తీ, జీడిమెట్ల, మల్కాజిగిరి, ఉప్పల్, బోడుప్పల్, రామంతాపూర్, బోయినపల్లి, బేగంపేట, తార్నాక, కుషాయిగూడ, ఈసీఐఎల్, నాచారం, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, మూసాపేట, కూకట్‌పల్లి, నిజాంపేట, ప్యాట్నీ, బేగంపేట, చిలకలగూడ, సికింద్రాబాద్ వారసిగూడ, కంటోన్మెంట్, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. పలు ప్రాంతాల్లో రోడ్డుపైకి వర్షపునీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాలు అలాగే కొద్ది రోజులు కొనసాగవచ్చునని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

### అక్రమ నిర్మాణాలు సరే..

## మరి.. శిథిల భవనాల మాటేంటీ?

**వానలు లేనప్పుడే కూల్చేయాలంటున్న నిపుణులు ● బిక్కుబిక్కుమని జీవిస్తున్న పరిసరవాసులు**



హైదరాబాద్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : ఇటు శిథిలా వస్తలోని పాత భవనాలు కూలేందుకు సన్నద్దత.. అటు చూసీ చూడనట్లుంటున్న అధికారుల ఉదాసీనత.. వెరసి ఆయా శిథిల భవనాల చుట్టుపక్కన ఉన్న వారు బిక్కు బిక్కుమంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఏ ఇల్లు ఎప్పుడు కూలుతుందో తెలియక హైరానా పడుతున్నారు. మరీ ముఖ్యంగా వానలు వదలకుండా కురిస్తే ఈ ప్రమాదాలు మరింతగా ఖాయం అవుతున్నాయి. అక్రమంగా నిర్మిస్తున్న కొత్త కొత్త భవనాల పైనే దృష్టి సారిస్తున్న అధికారులు పాత భవనాల గురించి కూడా ఓ కన్నెయాలని పలువురు గుర్తు చేస్తున్నారు. ఖజానా రాబడిలో అక్రమ భవనాలే ఎక్కువగా ఉంటున్నాయి. కొత్తగా నిర్మించిన భవనాలు అన్నీ కూడా లే అవుట్ ప్రకారం కట్టారా? అనుమతి తీసుకున్న అంతస్తులకే పరిమితం అయ్యారా ? లేక మరిన్ని అంతస్తులు పెంచేసుకున్నారా అన్న దిశగా అధికారులు కూపీలు లాగుతున్నారు. కొందరైతే ఏకంగా అంతస్తులకు అంతస్తులే అక్రమంగా కట్టేసుకుంటున్నారు. ఇలాంటి వారి విషయంలో కఠినంగా ఉండాల్సిఉండగా రాజకీయ జోక్యాలతో కూల్చివేతలు ముందుకు సాగడం లేదంటున్నారు. అయితే అధికారులు మాత్రం కఠినంగా ఉంటూ కూల్చివేసిన ఘటనలను ఉదహరిస్తున్నారు. మహా అయితే తమని బదిలీ చేస్తారని ఎక్కడైనా పని చేసేందుకు తాము రెడీ అంటూ అక్రమార్కుల గుండెల్లో నిద్ర పోతున్నారు. ఇలాంటి అధికారులు ఎంత మంది ఉంటారంటారు!! కొత్త భవనాల కూల్చి వేతలు అటుంచితే పాత శిథిల భవనాల కూల్చివేతలు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 520 వరకు శిథిల భవనాలను అధికారులు గుర్తించారు. అయితే ఇందులో పడగొట్టింది మాత్రం కేవలం 30 భవనాల లోపునే కావడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారుగా 25 లక్షల భవనాలు ఉన్నాయి. ఇందులో సుమారుగా ఓ 15 లక్షల భవనాల నుండి జిహెచ్‌ఎంసి ఆస్తిపన్నును కూడా వసూలు చేసేస్తోంది. మహానగరంలో పాతబస్తీతో పాటు సికింద్రాబాద్, రాణిగంజ్, మెహదీపట్నంతో పాటు అనేక ప్రాంతాలలో వంద సంవత్సరాల కిందట నిర్మించిన భవనాలూ ఉన్నాయి. వేల సంఖ్యలో ఉన్న ఈ భవనాల్లో చాలా వరకు ఎప్పటికి అప్పడు కొందరు నిర్వహణ చేపడుతున్నారు. దీంతో ఈ భవనాలు శిథిలావస్తకు రాకుండా ఉంటున్నాయి. ఇవి కాకుండా సుమారు రెండు వేల వరకు శిథిల స్థితిలో ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఇలాంటి భవనాలను అధికారులు వేసవి కాలంలోనే గుర్తించి వాటిని కూల్చివేయాల్సి ఉంది. ఈ ఏడాదిలో సుమారుగా 530 వరకు శిథిల భవనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు కూల్చింది మాత్రం కేవలం 30 లోపునేనని తెలియవచ్చింది. అయితే చాలా భవనాల కూల్చివేతలకు నోటీసులు ఇచ్చినా రాజకీయ జోక్యం వల్ల భారీగా నజరానాలు చెల్లించుకోవడం వల్ల అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీంతో శిథిల భవనాల పక్కనే ఉంటున్న ఇతర నివాసితులు రాత్రింబవళ్లూ అభద్రతా భావంతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

**ఏ ఏడాదిలో ఎన్ని కూల్చారు..** కూల్చిన శిథిల భవనాలపై లెక్కలు చూస్తుంటే ఎవరికైనా ఆశ్చర్యం వేయక మానదేమో.. లెక్కలేనన్న భవనాలు శిథిలమవుతుంటే వాటి కూల్చివేతలకే దిక్కుండడం లేదు. అధికారులు చెబుతున్న శిథిల భవనాలు ఏ ఏడాదిలో ఎన్ని కూల్చారో ఓ సారి పరిశీలిస్తే.. 2016లో (485 భవనాలు), 2017లో 294భవనాలు), 2018లో 402 భవనాలు), 2019 లో 453 భవనాలు), 2020లో 231భవనాలు), 2021 లో 201భవనాలు), 2022లో 30 భవనాలు) కూల్చిన జాబితాలో ఉన్నాయి.

## భర్తపై అనుమానంతో ఒంటిపై వేడి నూనె పోసిన భార్య

జియాగూడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: అనుమానం పెనుభూతంలో భార్య భర్తవంటిపై వేడి నూనె పోసిన సంఘటన మంగళవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ కథనం ప్రకారం.. దరియాబాగ్ జియాగూడ ధరియాబాగ్ ప్రాంతానికి చెందిన గిరిధర్‌లాల్ (50), రేణుక(40)లు ఇద్దరు భార్య భర్తలు, వీరికి ముగ్గురు సంతానం, అయితే గత కొద్దిరోజులనుంచి రేణుక భర్త గిరిధర్ లాల్ వేరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అనుమానం పెంచుకుంది. మంగళవారం భార్య, భర్తల మధ్య గొడువ పెట్టుకున్నారు. దీంతో అప్పటి ఇంట్లో ఉన్న వేడి నూనె భర్త గిరిధర్‌లాల్‌పై పోసింది. దీంతో తీవ్రగాయాలకు గురయ్యారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనాపై ఆరా తీశారు. ప్రమాదానికి గురైన గిరిధర్‌లాల్ ఉస్మానియా ఆసుపత్రిలో బర్న్స్‌వార్డులో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. కుల్సుంపురా పోలీసులు కేసు నమోదు చేశారు.

## విద్యుదాఘాతంతో గృహిణి మృతి

చార్మినార్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ గృహిణి మృతి చెందిన సంఘటన పాతబస్తీ కాలాపత్తర్ పోలీస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్స్‌స్పెక్టర్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. బిలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ వహీద్ భార్య రిజ్వానా బేగం(28) మంగళవారం ఉదయం తమ ఇంట్లో ఉన్న మోటారు పంపు ద్వారా సంపులో ఉన్న నీటిని ట్యాంకుకు ఎక్కిస్తుండగా అదే సమయంలో మోటారు పంపు ఆగిపోయింది. రిజ్వానా బేగం మంచి నీటి పైపును పట్టుకున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ రావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రిజ్వానా బేగం, వాహిద్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ కేసును కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవోపేతంగా ‘మహాలింగార్చన’

చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: భక్తులుతిలకిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆర్టీసిక్రాస్ రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో జరుగుతున్న నవరాత్రోత్సవాల్లో భాగంగా “మహాలింగార్చన” కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు ఎవిఎస్.రమణమూర్తి పాల్గొన్నారు.

## వేర్వేరు కిడ్నాప్ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: రెండు వేరువేరు కిడ్నాప్ల వ్యవహారంలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన సరూర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐదు రోజుల క్రితం లంక సుబ్రహ్మణ్యం అనే యువకుడి కిడ్నాప్ వ్యవహారాన్ని ఎస్‌ఓటి పోలీసులు సేదించి ఓ కార్పొరేటర్‌తో కలిపి పది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. కాగా సుబ్రహ్మణ్యం కిడ్నాప్ వ్యవహారంలో ఏ2గా ఉన్న గారెల్ల శ్రవణ్‌ను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో నిందితులను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయస్థానంలో పిటి వారెంట్ దాఖలు చేశామని ఇన్స్పెక్టర్ సీతారాం వెల్లడించారు.

**కిడ్నాప్ కేసులో లొంగుబాటు..** సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 28వ తేదీన నమోదు చేసిన మరో కిడ్నాప్ వ్యవహారంలో ఏ1 నిందితుడిగా ఉన్న కోటేశ్వరరావు సోమవారం రాత్రి పోలీసులకు లొంగిపోయాడని ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపారు. లొంగిపోయిన నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

## పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థిని అదృశ్యం



అదృశ్యమైన పూజిత

దుండిగల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : పరీక్షా కేంద్రానికి వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, మామిడియాల్ ప్రాంతానికి చెందిన వీరేశం కూతురు పూజిత(20) మల్లారెడ్డి ఫార్మసి కళాశాలలో బిఫార్మసి విద్యనభ్యసిస్తోంది. ఈనెల 5న(సోమవారం) పూజిత సెకండ్ ఇయర్ సెమిస్టర్ పరీక్ష రాయల్సి ఉండగా ఆరోజు ఉదయం 8:30గంటలకు తన సోదరుడు పరీక్షాకేంద్రమైన దుండిగల్‌లోని ఐఏఆర్ఈ కళాశాల వద్ద దింపి వెళ్ళాడు. అయితే పరీక్ష రాసేందుకు వెళ్ళిన పూజిత తిరిగి ఇల్లు చేరుకోకపోవడంతో పాటు ఆమె ఫోన్ స్విచ్ఆఫ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువులు, తెలిసినచోట్ల ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.కాగా తన కూతురు అదృశ్యంపైన ప్రశాంత్‌రెడ్డి అనే యువకుడిపై అనుమానాలు ఉన్నట్లు వీరేశం తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## పోలీసు ఉద్యోగ భర్తీల్లో కనిపించని రూల్ ఆఫ్ రిజర్వేషన్

**మందకృష్ణ మాదిగ**




సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : పోలీసు ఉద్యోగ భర్తీల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా ఎస్సీ, ఎస్టీ,బీసీ అట్టడుగు వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. సికింద్రాబాద్ పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈయేడు ఏప్రిల్ 25న జారీ చేసిన ఎస్ఐ, కానిస్టెబుల్ పరీక్షల్లో ఓసీ,బీసీ, ఎస్సీఎస్టీ విద్యార్థులకు కనీస అర్హత మార్కులను 30శాతంగా నిర్ణయించారని తెలిపారు. కాని గత 2015 సంవత్సరం డిసెంబర్ 31న, 2018 మే 30న నోటిఫికేషన్‌లలో ఓసీ, బీసీ, ఎస్సీఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కులను 40శాతం, 35శాతం, 30శాతంగా నిర్ణయించారని తెలిపారు. 2015, 2018 సంవత్సరంలో జారి చేసిన నోటిషికేషన్‌లతో పోల్చితే ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కులను తగ్గించకుండా సమాన మార్కులు నిర్ణయించడంవల్ల రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని తెలిపారు. ఈ కార్యాక్రమంలో హిస్టరీ లెక్చరర్ అశోక్, సామాజిక విశ్లేషకులు ప్రభాకర్ చౌటీ, ఎమ్మార్పీఎస్ హైద్రాబాద్ జిల్లా కన్వీనర్ బుషిపాక గణేష్, ఎంఎస్పీ జాతియ నాయకుడు రాగాడి సత్యంమాదిగ, లక్ష్మణ్ మదిగ, నలిమెల విజయరావు, రామారావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఆస్తుల తాకట్టు కోసం బిజెపి కుట్రలు : మంత్రి తలసాని



ఎన్.ఎఫ్.ఐఆర్ జాతీయ మహా సభలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మర్రి రాఘవయ్య, ఆదం సంతోష్, భరణి

కంటోన్మెంట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ఆస్థులను ప్రైవేట్‌పరం, దారదత్తం చేయడంలో ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయం సమీపంలోని రైల్వే స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌లో నిర్వహించిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ 30వ జాతీయ మహా సభలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. అతి పెద్ద రవాణా సంస్థగా పేరొందిన రైల్వే శాఖకు ఎంతో గుర్తింపు ఉందన్నారు. కోవిడ్ సమయంలో వేలాది గూడ్స్ రైళ్లను నడిపి దేశంలోని వివిధ ప్రాంతాలకు నిత్యవసర సరుకులు సరఫరా చేశారన్నారు. ప్రత్యేక రైళ్లను నడిపి కార్మికులు తమ నిబద్ధతను చాటుకున్నారన్నారు. 1962 లో చైనా దురాక్రమణ సమయంలో, 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో రైల్వే కార్మికులు 24 గంటల పాటు పనిచేసి యుద్ధట్యాంక్‌లను, యుద్ధ సామాగ్రిని సైనిక్‌లకు అందించడం జరిగిందన్నారు. 3200 మంది రైల్వే కార్మికులు కరోనా బారిన పడి మరణించారని అవేదన వ్యక్తం చేశారు. నేటి వరకు వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఒక పైసా కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం బాధకరమన్నారు. రైల్వే కార్మి కులు తలుచుకుంటే ఒక్కరైలు కూడా కదలదన్నారు. ఎన్ఎఫ్ఐఅర్, దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ అధ్యక్షులు గుమాన్ సింగ్, ఎన్ఎఫ్ఐఆర్ నేతలు వెంకట సుబ్బయ్య, ప్రభాకర్ ఆంద్రూస్, ఎం.భరణి బానుప్రసాద్, ఆదం సంతోష్‌కుమార్, ఎం.రుద్రారెడ్డి, శేఖర్, షషేర్‌రాహ్రుస్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాపర్‌కు వత్తాసు - ఎమ్మెల్యేపై అక్కసు బిజెపి తీరుపై టిఆర్ఎస్ నేతల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న భవానిప్రవీణ్‌కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** ఎమ్మెల్యేసుధీర్‌రెడ్డిపై బిజెపి నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని టిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు మండి పడ్డారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో మంగళవారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ మీడియా సమావేశం నిర్వహించింది. యువకుడి కిడ్నాప్ వ్యవహారంలో పోలీస్‌లకు అడ్డంగా దొరికిన కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిని బిజెపి నేతలు సమర్ధించడం సిగ్గుచేటన్నారు. బీజేపీకార్పొరేటర్ల ఆగడాలు శృతి మించాయని, తమ తప్పులను కప్పి పుచ్చేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. 36 సంవత్సరాలు ప్రజాక్షేత్రంలో మచ్చలేని నాయకుడిగా మన్ననలు పొందుతున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. భూములను కబ్జా చేసి అక్రమాలకు పాల్పడే సామ రంగారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డిలు యువకుడ్ని కిడ్నాప్ చేసిన కార్పోరేటర్‌కు అండగా నిలబడడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కార్పొరేటర్ తప్పు చేస్తే సరిదిద్దుకోవాల్సిన బిజెపి నాయకులు నరబలి చేయడానికి పూనుకున్న వ్యక్తిని వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సుజాతనాయక్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవానిప్రవీణ్‌కుమార్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి,చెరుకు సంగీతప్రశాంత్‌గౌడ్, పద్మానాయక్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్‌లు మాట్లాడారు.

## కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనే సీతా రామంజనేయ స్వామి ఆలయ నిర్వాహణ



దుర్గానగర్ సంక్షేమ సంఘం సభ్యులు

**సైదాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** దుర్గానగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనే శ్రీ సీతారామంజనేయ స్వామి దేవాలయం నిర్వాహణ కొనసాగుతుందని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుదుముల యాదగిరిరెడ్డి, ప్రధానకార్యదర్శి వంగ జగన్నాథ్‌రెడ్డిలు తెలిపారు. దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీ గురువారం నిమజ్జనం, లడ్డూవేలం, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బి.వెంకటేష్, కోశాధికారి బిల్లకంటి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఆనంద్ దీక్షిత్, రామకృష్ణాచారి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం : వాసవి క్లబ్



వాసవి క్లబ్ వారోత్సవాల్లో వాసవి ప్రతినిధులు

**వనస్థలిపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా జర్నలిస్టులు కీలకమని వారు తమ వంతు పాత్ర పోషిస్తారని వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షుడు విట్టా దూరయ్య, జిల్లా కేబినేట్ సెక్రటరీ రవికుమార్, రీజినల్ సెక్రటరీ అత్తులూరి మల్లికార్జునరావు, వనస్థలిపురం అధ్యక్షుడు ఆర్.శ్యాంసుందర్‌రావులు పేర్కొన్నారు. వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జర్నలిస్ట్ డే ను నిర్వహించి పలువురు జర్నలిస్టులను శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి జర్నలిస్టులు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాస్తు నిపుణులు కృష్ణాదిశేషు, శివనాగేశ్వరరావు, రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఉచిత శిక్షణ

**మలక్‌పేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్ లో సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎస్సి అధికారి DSCDO రామారావు గారు సంచాలకులు డాక్టర్ సుచరితరాయ్ ఒక ప్రకటనలో తెలిపారు WWW.TSSCSTUDY CICRLE.CO. IN వెబ్ సైట్ ద్వారా సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షను సెప్టెంబర్ 18న హైద్రాబాద్ వరంగల్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23546552 నంబరును సంప్రదించాలని సూచించారు.

## ఇంజాపూర్ పద్మశాలి సంఘం కార్యవర్గ ఎన్నిక

**తుర్కయంజాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీని పద్మశాలి సంఘంభవనంలో ఇంజాపూర్ పద్మశాలి సంఘము కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇంజాపూర్ పద్మశాలి కులస్తులు పాల్గొని పున్న రమణ విశ్వం నేత ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పున్న శ్రీనివాస్‌నేత, ఉపాధ్యక్షులుగా చెరుపల్లి హరిశంకర్, గడ్డం కాశివిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా దుదుకు పాండు, సహాయక కార్యదర్శిగా దాసప్రత్రి జానకి రాము, కోశాధికారిగా కొంపల్లి సాంబశివుడు, కార్య నిర్వహణ కమిటీ సభ్యులుగా బొల్ల సుధీర్‌కుమార్, మునగపాటి పరమేష్, చెరుపెల్లి యాదయ్య, బొద్దుల హనుమంతు, సలహాదారులుగా పున్న రమణ విశ్వం, నక్క శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ నాతో పాటు ఎన్నుకోబడిన వారందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మమ్మల్ని విస్మరించి కిడ్నాపర్లకు బిజెపి అండ : లంక

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** పార్టీకోసం పనిచేసిన బిజెపి కార్యకర్త కిడ్నాపైన వ్యక్తి కుటుంబాన్ని పక్కనపెట్టి కిడ్నాప్ చేసిన కార్పొరేటర్‌కు అండగా నిలుస్తామని బిజెపి నాయకులు చెప్పడం సిగ్గుమాలిన చర్య అని కిడ్నాప్ గురైన సుబ్రహ్మణ్యం తండ్రి లంక లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న నా కొడుకును పోలీసులు సమర్ధవంతంగా కాపాడారని పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన వారిని కాదని నరబలికి పూనుకున్న కార్పొరేటర్ ఇతరులకు అండగా నిలవడం సరైన పద్ధతి కాదని అన్నారు. మమ్మల్ని పరామర్శించకపోగా మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న నాయకుల బాగోతం త్వరలో బట్టబయలు చేస్తామని హెచ్చరించారు.

## సాయిబాబా పీఠాన్ని సందర్శించిన నిరంజన్‌రెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌లోనున్న శ్రీ ద్వారకామాయి షిర్డీ సాయిబాబా పీఠాన్ని బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్ళెం నిరంజన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ ఆశీస్సులు తీసుకొని సాయిబాబాకు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం బాలాపూర్ గణనాథుడిని సందర్శించాలని పీఠాధిపతిని కోరారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



లబ్ధిదారులకు కొత్త పెన్షన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన 597మందికి కొత్త పెన్షన్ గుర్తింపు కార్డులను కార్పోరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పోరేటర్ సునితరాముయాదవ్, డిసి రాజు, ప్రాజెక్టు అధికారి మల్లికార్జున్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు. **ఆర్‌కెనగర్‌లో...** ఆర్‌కెనగర్ జై గణేష్ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఘననాదుడిని ఎమ్మెల్యే మైనంపల్లి దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, శ్రీధర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు



లబ్ధిదారులకు చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పథకం నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హబ్సిగూడలో జరిగిన కార్యక్రమంలో సిఎం సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి పథకం ఎంతో ఉపయోపడుతుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు రాంచందర్ చారికి రూ.36వేల చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు మహేందర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, గరిక సుధాకర్, గుడి మధుసూధన్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, పిట్టల నరేష్ ముదిరాజ్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, కొంపల్లి రాజ్‌కుమార్, సూరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు : తెలంగాణ రాష్ట్ర బిజెపి ఇంఛార్జి తరుణ్ చుగ్

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పార్టీ కోసం పని చేసే వారికి తప్పక గుర్తింపునిస్తామని తెలంగాణ రాష్ట్ర బిజెపి ఇంఛార్జి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో తరుణ్ చుగ్‌ను కలిసారు. ఈ సందర్భంగా తరుణ్ చుగ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. బిజెపి అధికారంలోకి వస్తే పండుగలకు ఎలాంటి ఆటంకాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

## మురుగునీటితో కలుషితమవుతున్న మంచినీరు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** భారీ వర్షం కురియడంతో బస్తీలు, కాలనీలు చెరువులను తలపించాయి. ఎడతెరపిలేకుండా సుమారు గంటకు పైగా వర్షంకురవడంతో ఎల్బీనగర్లోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్‌కాలనీలో భారీగా వర్షం నీరు రావడంతో డ్రైనేజీ, మంచినీరు పూర్తిగా వర్షంనీటి వరదలో కలిసిపోయాయి. దీంతో కాలనీలోని డ్రైనేజీ మురికినీరు, వరదనీరులో కలిసి పూర్తిగా నల్లరంగులో పారుతుంది. డ్రైనేజీనీరు, మంచినీటి పైప్లైన్‌లో కలిసి నీరు పూర్తిగా కలుషితం అవుతుందని వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## లింగోజిగూడ డివిజన్‌లో... అధికారుల ఆశీర్వాదంతోనే జోరుగా అక్రమ నిర్మాణాలు



కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్డు

**సైదాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** అధికారుల ఆశీర్వాదంతో లింగోజిగూడ డివిజన్‌లో పలు చోట్ల అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిద్ర పోతున్న వారిని లేపవచ్చు కాని నిద్ర నటించే వారిని లేపడం ఎవరి తరం కాదన్న సామెత ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులకు సరిగ్గా సరిపోతుంది. సామాన్యుడు ఇళ్లు కట్టుకుంటే వంద ప్రశ్నలతో వేధించి నోటీసులు లేకుండానే కూల్చివేయడానికి కూడా వెనుకంజ వేయని టౌన్ ప్లానింగ్ అధికారులు డివిజన్‌లో బడాబాబులు కడుతున్న అక్రమ నిర్మాణాల పట్ల మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి కనీస అనుమతులు లేకుండా ఏకంగా వాణిజ్యపరమైన నిర్మాణాలు చేపడుతున్నా నోటీసుల పేరిట కాలం వెళ్లదీస్తూ అక్రమ నిర్మాణాలు పూర్తి కావడానికి అధికారులే తగినంత సమయం ఇస్తుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా వాణిజ్య పరమైన అవసరాల కోసం భారీ షెడ్డును నిర్మిస్తున్నప్పటికి టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం నోటీసుల మంత్రం జపిస్తూ అక్రమ నిర్మాణం పూర్తి కావడానికి పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. భారీ షెడ్డు నిర్మాణ ం చేపట్టాలంటే నెలల సమయమే పడుతుంది. మరి నిర్మాణం మొదలు పెట్టినప్పటి నుంచి మరో వారంలో నిర్మాణ ం పూర్తయ్యే దశకు చేరుకున్న ఈ అక్రమ నిర్మాణానికి రెండు నోటీసులు ఇచ్చే సమయం, అధికారులకు ఎందుకు దొరక లేదన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా ఉంది. దీనికి సమాధానం అధికారులకే తెలియాలి. నోటీసుల పేరిట నిర్మాణం పూర్తి కావడానికి కావాల్సినంత సమయం ఇచ్చి పరోక్షంగా అక్రమ నిరా ్మణాలకు ఇక్కడి టౌన్‌ప్లానింగ్ అధికారులే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. షెడ్డు నిరా ్మణ అనుమతి గురించి 'ప్రభాతవార్త' టౌన్‌ప్లానింగ్ అధికారుల వివరణ కోరగా ఒక నోటీసు ఇచ్చాం మరో నోటీసు ఇచ్చిన తర్వాతే చర్య తీసుకుంటాం అని తెలిపారు. అయితే వారంలోగా ఈ నిర్మాణమే పూర్తి కానుండడం గమనార్హం. అధికారుల పనితీరుకు ఇది నిదర ్శనం.

## భూములు కోల్పోయిన రైతులకు భూమి లేదా తమ స్థలం ఇవ్వాలి : సిపిఎం

**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** బండ రావిరాల సర్వేనెంబర్ 268లో భూములు కోల్పోయిన రైతులకు భూమికి భూమి, లేదా ఉన్న స్థలం ఇవ్వాలని గత 22 రోజులుగా దీక్ష చేస్తున్న రైతులకు సిపిఎం పార్టీ అండగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సిపిఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ రైతులు చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం దిగివచ్చి నష్టపరిహారం ఇచ్చేంతవరకు పోరాటం చేయాలన్నారు. మండలానికి ఎమ్మెల్యే మంత్రులు ఎవరు ఇచ్చిన అడ్డుకోవాలని, నష్టపరిహారం ఇవ్వని యెడల రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ, గుండె శివకుమార్, శ్రీనివాస్, ఇరుగు బిక్షపతి, మహేష్, రైతులు పాల్గొన్నారు.

## వినాయక స్వాగత వేడుకకు షర్మిలకు ఆహ్వానం

**ఉప్పల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదిన ఉప్పల్ చౌరస్తాలో నిర్వహించే వినాయక స్వాగత వేదిక వద్దకు రావాలని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు మంగళవారం ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అధ్యక్షుడు బాషపల్లి నిరంజన్‌చారి, అన్న బాలకృష్ణ, వైఎస్ఆర్‌టిపి నాయకులు కుదుముల ప్రదీప్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ చౌరస్తాలో ఈనెల 9వ తేదిన భారీ ఎత్తున స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి నేతలు జ్ఞానేశ్వర్‌గౌడ్, లింగంపల్లి అనిల్‌కుమార్, సల్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో మేయర్ సిసి రోడ్డు పరిశీలన



రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేయించాలని ఎఇని ఆదేశిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 29వ డివిజన్‌లోనున్న గాంధీనగర్ వీకర్ సెక్షన్ కాలనీలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును మంగళవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. కార్పొరేటర్ పెద్దబావి శోభఆనంద్‌రెడ్డి, ఎఇఇ రాంప్రసాద్ రెడ్డిలతో కలిసి ఆమె రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజల సౌకర్యార్థం వేసిన సిసి రోడ్డుకు సక్రమంగా వాటర్ క్యూరింగ్ చేయించాలని ఎఇని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకురాలు మణెమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుని చికిత్సకు సాయం



రూ.1.50 ఎల్‌ఓసిని అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుని వైద్య చికిత్సకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేయూతనిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామానికి చెందిన తీగల బుచ్చిరెడ్డి ఊపిరితిత్తులవ్యాధితో బాధపడుతున్నాడు. అయితే వైద్య ఖర్చులు భరించలేని ఆయన స్థానిక నాయకుల ఆధ్వర్యంలో మంత్రిని ఆశ్రయించారు. ఈ మేరకు సబితారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.1.50 లక్షల ఎల్‌ఓసిని మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వును మంగళవారం ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జి పన్నాల కృష్ణారెడ్డి, నాయకులు కోటగిరి జంగయ్య, అంకంగారి కుమార్‌గౌడ్, ముద్దం వెంకట్‌రెడ్డి, కొండ విజయ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి అత్యుత్తమం : మంత్రి



ఉపాధ్యాయులకు అవార్డులను అందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**కుషాయిగూడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా సర్కిల్ విజయ హై స్కూల్ ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబు సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికవ్వడంతో రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అదేవిధంగా కరస్పాండెంట్ రాజేష్ ప్రిన్సిపల్ ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యుత్తమ నిస్వార్థపూరితమైన ఉపాధ్యాయ వృత్తిని ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు.. ఈ కార్యక్రమంలో డీఈవో విజయకుమారి, పాఠశాల చైర్మన్ బసప్ప, వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి మండపాల వద్ద ఘనంగా పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి



పూజలు నిర్వహిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు



ఉప్పల్‌లో వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు



పూజలు నిర్వహిస్తున్న అనితానాయక్, చంద్రమోహన్ తదితరులు

**మలక్‌పేట మార్కెట్‌లో...** మలక్‌పేట శ్రీ కృపా హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి నగర వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అనితానాయక్ విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిక్కా చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

**మూసారాంబాగ్‌లో...** మూసారాంబాగ్ జ్ఞానదీప్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి టిపిసిసి అధికార ప్రతినిధి చెకొలేకార్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

**ఓల్డ్ మలక్‌పేటలో...** ఓల్డ్ మలక్‌పేటలో వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి తూర్పు మండల డిసిపి సునీల్‌దత్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిటి శంకర్ ముదిరాజ్, రామకృష్ణ, నర్సింగ్‌రావుయాదవ్, రాజు, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

**తోట శ్యాం ఆధ్వర్యంలో...** సాయిబాబానగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహంవద్ద ఆచార్య జయశంకర్ సార్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తోట శ్యాం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవి, జగదీష్, వంశీ, వేణు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

**మునగనూర్‌లో...** తుర్కయాంజాల్ మున్సిపాలిటీ గణేశ్ ఉత్సవాలలో భాగంగా మునగనూర్‌లో 15వ వార్డు కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ టిఆర్ఎస్ అధ్యక్షులు వేముల అమరేందర్‌రెడ్డి పాల్గొని వినాయకులని దర్శించుకొని అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సంగీతమోహన్‌గుప్తా, శివకుమార్, సద్దాం, ప్రశాంత్, నాగరాజు నర్సింహ, మహిళలు పాల్గొన్నారు.

**ఎస్‌కెడినగర్‌లో...** గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఎస్‌కెడినగర్‌లో ఎన్ఎస్‌యుఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌పటేల్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ యూత్ అసోసియేషన్ నెలకొల్పిన గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. బిజెపి నాయకులు కొంతం నాగిరెడ్డి, బిఎన్‌రెడ్డినగర్ బిజెపి అధ్యక్షుడు కొంతం నవకిషోర్‌రెడ్డిలు గణేషుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**ఉప్పల్ సర్కిల్‌లో...** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వినాయక మండపాలవద్ద పలువురు పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్‌లో బిజెపి సీనియర్ నాయకులు బండారు వెంకట్రావ్ ఆధ్వర్యంలో డీమార్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్‌గౌడ్, ఉత్సవ కమిటి నేతలు బండారు వెంకట్రావ్, పన్నాల అర్జున్, టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, గరిక సుధాకర్, జెసిబి రాజు తదితరులు పాల్గొన్నారు.

**బద్దూరి ఆధ్వర్యంలో...** గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డిఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ హనుమాన్‌నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక మండపంవద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు, భక్తులకు ఈ సందర్భంగా బద్దూరి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైతన్యపురి పోలీస్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

**బాలాపూర్‌లో....** ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడిని తెలంగాణ పిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్ రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనను గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్ళెం నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి ప్రత్యేక లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో...** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో వీరభద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి మండపాన్ని మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్ దర్శించుకుని గణనాథుడికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంబాబుగౌడ్, రావుల రమేష్, శ్రీను, గణేష్, సతీష్‌కుమార్, శివ, మధు, సాయికుమార్, నర్సింహ్మ, లక్ష్మణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

**చింతల్ బస్తీలో...** తార్నాక చింతల్ బస్తీలోని యంగ్‌స్టర్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాదుడిని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తికచంద్రారెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేపాల్ జోన్ సెట్టింగ్స్ దిలీప్‌రెడ్డి, రఘురాంరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, నరేష్, ఎస్సీ మోర్చ అధ్యక్షులు కరుణాకర్, చిన్న, శాంతికుమార్, మనోహర్, టి.లక్ష్మినారాయణ, ఎం.రాజు, ప్రసన్న కుమార్, వసంత్‌కుమార్, టి.టి.లక్ష్మినారాయణ, సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.



ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ సత్కరిస్తున్న బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి



అమరేందర్‌రెడ్డికి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్న బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీప్రసన్న తదితరులు



గణనాదుడిని దర్శించుకుంటున్న శ్రీలత శోభన్‌రెడ్డి, కార్తికరెడ్డి



పూజలు నిర్వహిస్తున్న అధికార ప్రతినిధి చెకొలేకార్ శ్రీనివాస్